క్యాబినెట్ తీర్మానం ఉందా ?

- కెసిఆర్‌కు 18 ప్రశ్నలు సంధించిన న్యాయ కమిషన్
- 50 నిమిషాల పాటు విచారణ
- భారీ బందోస్తు ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం నీటిపారుదల ప్రాజెక్టు బ్యారేజీల వైఫల్యంపై మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును న్యాయవిచారణ కమిషన్ విచారించింది. బుధవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12:50 నిమిషాల వరకు ఇది చోటుచేసుకుంది. విచారణ కమిషన్ చైర్మన్ పిసి ఘోష్‌తోపాటు కార్యదర్శి మురళీధర్, కెసిఆర్ ముగ్గురే ఉన్నారు. ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ఎవరికి అనుమతించలేదు. తొలుత ఓపెన్ హాల్‌లో విచారణ చేయాలని కమిషన్ చైర్మెన్ భావించిన 'తన ఆరోగ్యం బాగాలేదనీ, జలుబుతో స్వల్ప అనారోగ్యానికి గురయ్యాయనీ, వన్ టూ వన్ అయితే తాను స్పష్టంగా సమాధానాలు చెప్పిగలనని' కెసిఆర్ చేసిన విజ్ఞప్తిని కమిషన్ చైర్మెన్ పిసి ఘోష్ అనుమతించారు. దీంతో ముగ్గురు మాత్రమే ఓపెన్ హాల్‌లో ఉన్నారు. మీడియాతోటు ఇతరులను ఓపెన్ హాల్ నుంచి బయటకు పంపారు. సుమారు 50 నిమిషాలపాటు సాగిన విచారణలో కెసిఆర్‌ను పదుల సంఖ్యలో కమిషన్ ప్రశ్నలు సంధించిం ది. కాళేశ్వరం ప్రాజెక్టు తొలి నుంచి చివరి దాకా జరిగిన ప్రక్రియపై సమాచారం రాబట్టినట్టు తెలిసింది. 115వ సాక్షిగా హాజరైన కెసిఆర్ నుంచి అఫిడవిట్ సైతం తీసుకున్నారు.

కమిషన్ వద్ద కారులో నుంచి అభివాదం చేస్తున్న కెసిఆర్

క్యాబినెట్ అనుమతి ఉందా ?

విచారణ సందర్భంగా కెసిఆర్‌ను కాళేశ్వరం కమిషన్ 18 ప్రశ్నలు అడిగింది.కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణాని కి ఎవరు నిర్ణయం తీసుకున్నారని కమిషన్ ప్రశ్నించింది. ఈ క్రమంలో కాళేశ్వరం రీ ఇంజినీరింగ్ గురించి కెసిఆర్ కమిషన్‌కు వివరించారు. క్యాబినెట్, ప్రభుత్వ ఆమోదంతోనే బ్యారేజీల నిర్మాణం జరిగిందని కెసిఆర్ సమాధానం చెప్పారు. వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారం నిర్మాణం జరిగిందనీ, అన్నీ అనుమతులు తీసుకున్నట్టు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అన్నీ అంశాలతో కూడిన ముద్రించిన పుస్తకాన్ని కమిషన్‌కు అందజేశారు. కాళేశ్వరం కార్పొరేషన్ గురించి కూడా కమిషన్ ఆరా తీసింది. నూతన రాష్ట్రంలో నిధులను దృష్టిలో ఉంచుకుని కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్టు కమిషన్‌కు తెలియజేశారు. ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. బ్యారేజీల్లో నీటి నిల్వ గురించి కెసిఆర్‌ను కమిషన్ ఆరా తీయగా, ఎంత నీరు నిల్వ చేయాలన్నది ఇంజినీర్లకు సంబంధించిన అంశమనీ కెసిఆర్ అభిప్రాయపడ్డారు. బ్యారేజీల నిర్మాణం స్థలం ఎంపిక, మార్పు సాంకేతి కపరమైన విషయమని వివరించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టినట్టు చెప్పారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్‌కు జీవో నెంబరు 45, అపరేషన్, నిర్వహణ పుస్తకాన్ని అందజేశారు.

ఇప్పటికే 114 మంది విచారణ

కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు బీఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ రావడం సంచనలమే అయింది. బీఆర్‌కే భవన్‌లో ఆయన్ను జస్టిస్ బీసీ ఘోష్ ప్రశ్నించారు. రి ఇంజినీరింగ్, ఆనకట్టల నిర్మాణం, ఒప్పందాలు, కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, నీటి నిల్వలపై ఆయన్ను ఆరా తీసింది. ఇప్పటివరకు 114 మందిని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారించింది. ఇప్పటివరకు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ప్రశ్నించిన ఘోష్ కమిషన్ ఇటీవలే మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, మరో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును సైతం విచారించిన సంగతి తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీలు రావడం తదితర కారణాల నేపథ్యంలో గత ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్‌తో ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి బ్యారేజీల నిర్మాణ ఇంజినీర్లు, క్వాలిటీ కంట్రోల్, అప్పరేషన్, నిర్వహణ, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సిడిఒ), నీటిపారుదల, ఆర్థిక శాఖల అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారించడం, వారి నుంచి అఫిడవిట్లు తీసుకుని క్రాస్ ఎగ్జామినేషన్ను సైతం పూర్తిచేసింది. తాజాగా కెసిఆర్‌ను పిలిచింది. బుధవారం ఎర్రవల్లి ఫామ్‌నుంచి ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమైన కెసిఆర్, హైదరాబాద్‌లో బీఆర్‌కే భవన్ వరకు భారీ కాన్వాయ్‌తో వచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

దేశానికే ఉత్పత్తులను అందించాలి

- ఆ దిశగా తెలంగాణలో సాగు జరగాలి
- హుస్నాబాద్ మండలం పందిళ్లలో నాగలి పట్టి.. విత్తనాలు చల్లిన మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈసారి మంచిగా వర్షాలు కురుస్తాయని, దేశానికే మన ఉత్పత్తులు అందించేలా తెలంగాణ ఎదగాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిళ్ల గ్రామంలో బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా మంత్రి స్వయంగా ఎడ్లతో నాగలి దున్ని.. రైతులతో కలిసి పెసర విత్తనాలు చల్లారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతు సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులు ఒక్క గుంట కూడా బీడు లేకుండా వరి, మొక్కజొన్న, ఆయిల్ ఫామ్ ఇతర ఏదైనా పంటలు వేయాలని కోరారు. ఎక్కడ ఖాళీ జాగా బీడు లేకుండా చూడాలన్నారు. రైతులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సాయం, మద్దతు ధర అందిస్తుందని తెలిపారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అన్ని రాజకీయ మిత్రులు, అధికారులు కలిసి ఎక్కడా ఖాళీ స్థలం లేకుండా రైతులతో సాగు చేయించాలన్నారు. విత్తనాలు వేసుకునే శక్తి లేని వారికి తమ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. హుస్నాబాద్‌లో మూడు రోజుల పాటు రైతు మహోత్సవం కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ ప్రాంత రైతాంగానికి వ్యవసాయ విధానాలు, పద్ధతులపై మూడు రోజుల కాన్ఫరెన్స్ జరిగిందన్నారు.

వంగర పోలీసులను ఆదర్శంగా తీసుకోండి

- ఎక్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేరాల అదుపుతో పాటు వాటి నివారణకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో పేర్కొన్నారు. "నేరాలను నియంత్రించడానికి కఠినంగా వ్యవహరించడమే కాదు…అవి జరగడానికి మూల కారణాలను అన్వేషించి, అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను అమలు చేయడమే నిజమైన పోలీసింగ్‌కు అర్థం. గ్రామాల్లో యువత గంజాయి వంటి దురలవాట్ల జోలికి పోకుండా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ….విద్య యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ…సాంఘిక దురాచారాలపై చైతన్యం కల్పిస్తూ.. వంగర పోలీసులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయం. రాష్ట్రంలో పోలీసులు వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లండి" అని సిఎం పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి కెసిఆర్ పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ బుధవారం పరామర్శించారు. కెసిఆర్‌తోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు. అలాగే, ఎమ్మెల్సీ కవిత కూడా ఆస్పత్రికి వెళ్లి పల్లాను పరామర్శించారు.

సంక్షేమ ఫలాలు అమలు చేస్తాం

- ములుగు జిల్లాకు మరో వెయ్యి ఇండ్లు మంజూరు
- అర్హులందరికీ దశలవారీగా ఇళ్ల మంజూరు
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దనసరి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ రాజ్యమంటే రాష్ట్రంలోని ప్రతి పేదవారికి ఇళ్లు నిర్మించడమే లక్ష్యమని, గత పాలకులు చేసిన అప్పులను తీర్చుకుంటూనే తల తాకట్టు పెట్టయినా అప్పులను తీర్చుతూ సంక్షేమ ఫలాలను అమలు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో 23మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేయడమే కాకుండా ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో మంత్రులు మాట్లాడారు.

రాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. ములుగు నియోజకవర్గానికి 3వేల ఇండ్లు మంజూరు కాగా ఐటిడిఎకు మరో 1500 ఇళ్లు మంజూరయ్యాయని, తాను మరో వెయ్యి ఇళ్లను మంజూరు చేస్తున్నామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారులకు వెంటనే ఉచితంగా ఇసుక కోసం కూపన్లను అందజేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అటవీశాఖ అధికారులు సైతం ఇళ్ల నిర్మాణ పనులను అడ్డుకోవద్దని అన్నారు. రానున్న రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు తమకు అండగా ఉండాలని కోరారు. జిల్లాను పూర్తిస్థాయిలో పర్యాటక ప్రాంతంగా మార్చడానికి నిధులు కేటాయించినట్టు చెప్పారు. రూ.70కోట్లతో రామప్పలో పనులు చేపట్టడమే కాకుండా రూ.30 కోట్లతో ఐలాండ్ అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. ప్రతి మహిళ.. మహిళా సంఘాల్లో చేరి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పొంది పలు రకాల వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఇక్కడి ప్రాంతంలోని మహిళలకు ఇతర ప్రాంతాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన బొంగు చికెన్‌పై శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని టేకులగూడెం అనే చిన్న ప్రాంతంలోనూ స్వయంగా మంత్రుల ద్వారా ఇందిరమ్మ గృహాల శంకుస్థాపన జరగడం ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని అన్నారు. ఏజెన్సీ ప్రజలను దృష్టిలో ఉంచుకొని కేవలం 140 గృహాలు ఉన్న చిన్న గ్రామానికి కూడా ప్రత్యేక వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి నీరు అందించిన ఘనత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్‌పి శబరీష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, ఆర్‌డిఒ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వల్లే కులగణన

- ఆర్ కృష్ణయ్య పోరాటంలో రిజర్వేషన్లను సాధించలేకపోయారు: ఈరవత్రి అనిల్ ఎద్దేవా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: బిజెపి ఎంపి ఆర్ కృష్ణయ్య తన 40 ఏళ్ల పోరాటంలో ఆయన బిసి రిజర్వేషన్లను సాధించలేకపోయారని మినరల్ డెవలంప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు కులగణన చేపట్టిందని తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పించే బిల్లుపై అసెంబ్లీలో తీర్మానం చేసిందని తెలిపారు. ఆ తీర్మానాన్ని అమోదించాలంటూ కేంద్రానికి పంపినట్టు చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనీ, రిజర్వేషన్లపై ప్రత్యేక జిఓ తీసుకరావాలంటూ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతున్నారని చెప్పారు. బిసి రిజర్వేషన్లపై జీవోను ఇచ్చిన తర్వాత కోర్టు కొట్టేస్తే దాన్ని రాజ్యాంగంలో 9వ షెడ్యూల్‌లో పెట్టించగలరా? అంటూ ఆర్.కృష్ణయ్యను ప్రశ్నించారు. బీజేపీ ఇచ్చిన పదవిని అడ్డం పెట్టుకుని ఆయన బీసీలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బిసిలకు దామాషా ప్రకారం హక్కులను కల్పించాలని రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం కులగణన చేస్తామంటూ ప్రకటించాల్సి వచ్చిందని తెలిపారు. బిసి రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో పొందుపరిచేలా ప్రయత్నించాలని డిమాండ్ చేశారు.

సామాన్యులకు బస్ ప్రయాణం భారం

- పెంచిన బస్ పాస్ చార్జీలను తగ్గించాలి : సిపిఎం
- ఆర్‌టిసి బస్సు భవన్ ముందు భారీ ధర్నా
- ఆర్‌టిసి సంస్థల కార్యదర్శి ముని శేఖర్‌కు వినతిపత్రం

ప్రజాశక్తి : హైదరాబాద్ బ్యూరో

బస్ పాస్ చార్జీలను పెంచి సామాన్యులకు ప్రయాణ సౌకర్యాన్ని భారంగా మార్చారని, పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్డు వద్ద గల బస్‌భవన్ ముందు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌టిసి సంస్థల కార్యదర్శి ముని శేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి మాట్లాడుతూ.. ఆర్‌టిసి యాజమాన్యం ఇటీవల 20 నుంచి 50 శాతం వరకు బస్ పాస్ చార్జీలు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు, విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల బస్ పాస్ రూ.400 నుంచి 600కు పెంచడం చాలా దారుణమన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సమయంలో బస్ పాస్ చార్జీలు పెంచి విద్యార్థులకు కానుకగా ఇస్తున్నట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద మధ్యతరగతి ప్రజలు, అసంఘటిత రంగ, కాంట్రాక్టు కార్మికులు ఎక్కువగా బస్సుల్లో ప్రయాణిస్తారని తెలిపారు. ఆర్డినరీ బస్‌పాస్‌ను రూ.1150 నుంచి రూ.1400కు, మెట్రో ఎక్స్‌ప్రెస్ రూ.1300 నుంచి రూ.1600కు, మెట్రో డీలక్స్ రూ.1450/- నుంచి రూ.1800కు పెంచి సామాన్యులకు ప్రయాణ సౌకర్యాన్ని దూరం చేస్తున్నారని చెప్పారు. పెరుగుతున్న నిత్యావసర ధరల నేపథ్యంలో బస్ పాస్ చార్జీలు కూడా పెంచి మరింత భారం ప్రజలపై వేస్తున్నారన్నారు. వెంటనే పెంచిన బస్ పాస్ చార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం శ్రీనివాస్, మహేందర్, ఆర్ వెంకటేష్, కుమారస్వామి, మారన్న, నరేష్, కిరణ్, అశోక్, అజయ్‌బాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు భవన్ ముందు ధర్నా చేస్తున్న హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ నాయకులు

కాళేశ్వరం వరల్డ్ బిగ్గెస్ట్ ఇంజనీర్ మిస్టేక్

- దాన్ని విభేదించే బిఆర్‌ఎస్ నుంచి బయటకొచ్చా : ఎంపి కొండా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో:

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద ఇంజనీరింగ్ తప్పిదమని బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుండలుబద్ధలు కొట్టి మరీ చెప్పారు. ఆ ప్రాజెక్టును విభేదించే బిఆర్‌ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చానని బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని మాజీ సిఎం కెసిఆర్ కాళేశ్వరం పేరుతో అప్పుల తెలంగాణ మార్చిపోయాడని విమర్శించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అంశం తనను కలిచివేసిందన్నారు. ఒక ఇంజనీర్‌గా ఆ ప్రాజెక్టును ఒప్పుకోలేకనే ఆ పార్టీ నుంచి బయటకు వచ్చానని తెలిపారు. క్యాబినెట్ అంటే కెసిఆర్.. కెసిఆర్ అంటే క్యాబినెట్ అని విమర్శించారు. ఈటల రాజేందర్ చెప్పింది 200 శాతం నిజమన్నారు. రైతులకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏడాదికి రూ.91 వేల కోట్లు ఇస్తున్నదని చెప్పారు. తెలంగాణకు చెందిన ఎనిమిది మంది ఎంపిలు జీరోలు కాదని, కేంద్రం నిధులు విడుదల చేస్తేనేగానీ ఇక్కడ పాలన నడుస్తలేదని తెలిపారు.

మహోద్యమంలా వనమహోత్సవం

- రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణతో కలిసి వన మహోత్సవం 2025 పోస్టరు ఆవిష్కరించిన మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న వనమహోత్సవం కార్యక్రమాన్ని మహోద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని అటవీ అధికారులను రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. వృక్షో రక్షిత రక్షితః నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పునరుద్ఘాటించారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో వన మహోత్సవం-2025 పోస్టర్‌ను తెలంగాణ అటవీ ప్రధాన సంరక్షణ అధికారి (పిసిసిఎఫ్) డాక్టర్ సువర్ణ, పిసిఎఫ్‌లు ప్రియాంక వర్గీస్, రామలింగంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ… ఈ ఏడాది తలపెట్టబోయే వనమహొత్సవ కార్యక్రమం వంద శాతం విజయవంతమయ్యేలా చూడాలన్నారు. అన్నివర్గాల వారు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కోరారు. నాటిన ప్రతి మొక్కనూ బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. పండ్ల మొక్కలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాల్లో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. 2024లో రాష్ట్రవ్యాప్తంగా 20.02 కోట్ల మొక్కలు నాటాలని ప్రణాళికలు వేసుకోగా…95 శాతం లక్ష్యాన్నే పూర్తి చేశారని గుర్తుచేశారు. ఈ సారి వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని దిశానిర్దేశం చేశారు.. ప్రతి గ్రామంలోనూ వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి ఇంటికీ మొక్కలిచ్చి నాటేందుకు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రజలు అడిగిన మొక్కలను అందజేయడానికి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

ఇళ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషద మొక్కలు, పూల మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో పూల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. గతం కంటే ఈసారి నైరుతి రుతుపవనాలు ముందే వచ్చిన నేపథ్యంలో అందరూ సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఈ దఫా వనమహొత్సవంలో ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారికి గుర్తించి ప్రోత్సాహకాలివ్వాలని అధికారులను ఆదేశించారు.

వెయ్యి కాదు... 210 స్కూళ్లలోనే ప్రీప్రైమరీ

- సర్కారు బడుల్లోనూ ఇకపై నర్సరీ
- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2025-26 విద్యాసంవత్సరం నుంచి సర్కారు బడుల్లోనూ నర్సరీ, ఎల్‌కెజి, యుకెసి తరగతులను నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈవి నరసింహారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 210 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైప్రీమరీ తరగతులను ప్రారంభిస్తామని తెలిపారు. అందుకు సంబంధించిన వార్షిక పని ప్రణాళిక, బడ్జెట్ (ఎడబ్ల్యుపి అండ్ బి)ని ప్రభుత్వం ఆమోదించిందని పేర్కొన్నారు. ప్రీప్రైమరీ తరగతుల్లో విద్యార్థులను చేర్చుకోవాలని డిఇఒలను ఆదేశించారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు మాత్రమే ప్రవేశాలున్నాయి. ప్రీప్రైమరీ తరగతులు ప్రయివేటు పాఠశాలల్లోనే ఉన్నాయి. సర్కారు బడుల్లోనూ ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలంటూ ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు ఎప్పటి నుంచో కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యాసంవత్సరంలో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించడానికి అనుమతి ఇవ్వడం గమనార్హం. రాష్ట్రంలో హన్మకొండ జిల్లాలో 16, జగిత్యాలలో 32, జయశంకర్ భూపాలపల్లిలో 31, కామారెడ్డిలో ఒకటి, కరీంనగర్‌లో మూడు, కొమరం భీం ఆసిఫాబాద్‌లో ఏడు, మంచిర్యాలలో 14, ములుగులో ఒకటి, నిర్మల్‌లో రెండు, నిజామాబాద్‌లో 15, పెద్దపల్లిలో 46, సిద్ధిపేటలో 29, వరంగల్‌లో 13 చొప్పున 210 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను 2025-26 విద్యాసంవత్సరంలో ప్రారంభించేందుకు అనుమతిచ్చామని తెలిపారు. అయితే ప్రస్తుత విద్యాసంవత్సరంలో వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించనున్నట్టు ప్రభుత్వం సమాలోచన చేసింది. ఇప్పుడు 210 ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభిస్తుండడం గమనార్హం. ఇంకోవైపు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరిలోనే ఎక్కువగా జరుగుతున్న విషయం తెలిసిందే. కానీ ఆయా జిల్లాల్లోనే ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించలేదు. రాష్ట్రంలో 30,137 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 18,259 ప్రభుత్వ ప్రైమరీ స్కూళ్లు ఉన్నాయి. ఇప్పుడు 210 స్కూళ్లలోనే ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించిం ది. మిగిలిన 18,049 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ఎప్పుడు ప్రారంభమవుతాయో వేచిచూడాల్సిందే.

రక్షణశాఖ సహకారంతో ఎస్‌ఎల్‌బిసి సొరంగం పనులు

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీశైలం ఎడమ కాలువ సొరంగం పనుల పునరుద్ధరణకు సిద్ధమవుతున్నామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మిగిలిన 9 కి.మీ సొరంగం పనులు వచ్చే రెండేండ్లల్లో పూర్తి చేయడానికి చేపడుతున్నామని వివరించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రక్షణ మంత్రిత్వశాఖతో జరిగిన భేటీలో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ నుంచి ఎస్‌ఎల్‌బిసి సొరంగం పూర్తి చేయడానికి సహకారం కావాలని కోరగా, అంగీకరించినట్టు చెప్పారు. శ్రీశైలం పులుల సంరక్షణ కేంద్రంగా ఉన్నందున హెలికాప్టర్ సర్వే చేసి, తదుపరి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఆర్మీలో ఉన్న కల్నల్ పరీక్షిత్ మెహరా, సరిహద్దు రోడ్డు సంస్థ మాజీ డిజి జనరల్ హర్పాల్ సింగ్‌ను డిప్యూటేషన్‌పై తెలంగాణకు పంపేందుకు కేంద్రం అంగీకరించిందని చెప్పారు. పరీక్షిత్ మెహరాను ప్రత్యేక కార్యదర్శిగా, జనరల్ హర్పాల్‌సింగ్‌ను గౌరవ సలహాదారుగా తీసుకుంటున్నామని తెలిపారు. వీరిద్దరి సహకారంతో రాష్ట్రంలో చేపిట్టిన అన్ని సొరంగాల నిర్మాణాలు పూర్తిచేస్తామన్నారు. డెన్మార్క్ నుంచి అత్యాధునిక ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పరికరాలు తీసుకొస్తున్నామని వివరించారు. వీటి ద్వారా 44 కి.మీ మొత్తం సొరంగం భూమిపై నుంచే భూమి లోపల కిలోమీటరు వరకు పరిస్థితి తెలుసుకుని తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

విచారణ పేరిట రేవంత్ రాక్షసానందం

- కెసిఆర్ అంటే ఒక చరిత్ర : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీటిపారుదల విషయంలో కెసిఆర్‌ను విచారణకు పిలిచారంటే.. హనుమంతుడి ముందు కుప్పిగంతులు వేయడమేనని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. ఇరిగేషన్ మీద కెసిఆర్‌కు ఉన్న అవగాహన బహుషా ఈ దేశంలోని సమకాలీన రాజకీయ నాయకులలో ఎవరికి ఉండదని, చివరకు ధర్మం, న్యాయమే గెలుస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణను సాధించిన, సస్యశ్యామలం చేసిన నాయకుడిగా కెసిఆర్ పేరు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతదని అభిప్రాయపడ్డారు. బుధవారం కెసిఆర్ కాళేశ్వరం న్యాయ కమిషన్ ముందు విచారణకు హాజరైన అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టులను కూలగొట్టడానికి వచ్చాడు తప్ప కట్టడానికి రాలేదన్నారు. విధ్వంసకరమైన ఆలోచనలతో పేదల ఇళ్లు కూలగొట్టడం, ప్రాజెక్టులను కూలగొట్టడం. రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు తప్ప ఈయనకు ఏం చేతకాదన్నారు. వంద జన్మలు ఎత్తినా రేవంత్ రెడ్డికి కెసిఆర్ గొప్పతనం అర్థం కాదన్నారు. రేవంత్ రెడ్డి గురువు, ఆయన జేజమ్మతో గొడవ పడి ఇక్కడ నుంచి తరిమిన వాడే కేసీఆర్ అని గుర్తు చేశారు.

రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టం.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేదాకా వెంటాడుతామని కెటిఆర్ స్పష్టం చేశారు. ఈ చిల్లర రాజకీయాలను పట్టించుకోవద్దని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. క్యాబినెట్ ఎట్ల పని చేస్తదో తెలియదన్నారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు ఆయనకు ముఖ్యమని వివరించారు. విచారణ పేరిట రేవంత్ రాక్షసానందం పొందుతున్నారని అభిప్రాయపడ్డారు. నిజం నిలకడగా తేలుతుందనీ, కొన్ని రోజులు కాళేశ్వరం అని, ఫోన్ ట్యాపింగ్ అని, ఈ ఫార్ములా అని డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. మంత్రి వర్గ విస్తరణ చేయలేని సిఎం.. చివరకు శాఖలు కేటాయించుకోలేకపోతున్నారని విమర్శించారు.

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

HMOP No.36/2024

Between:
తమ్మినీడి గంగాధరరావు ...పిటీషనర్
Vs
తమ్మినీడి వెంకట మంగా పార్వతి ...రెస్పాండెంట్స్

To.
తమ్మినీడి వెంకట మంగాపార్వతి,
W/o.గంగాధరరావు, D/o.చిలుకూరి మల్లేశ్వరరావు, డోర్‌నెం.4-127/B, దీన దయాలు కోలనీ, జగదగిరి గుట్ట, కుకట్‌పల్లి, హైదరాబాద్, తెలంగాణా స్టేట్.

పై నెంబరు HMOP లో పిటిషనరు తన వివాహ బంధాన్ని రద్దు చేసి విడాకులు ఇవ్వమని కోరుచు Divorce Petition దాఖలు చేసి, కోర్టు ద్వారా మీకు నోటీసులు ఎన్నిసారులు పంపినా మీకు అమలు జరగనందున ఈ పబ్లికేషన్ ద్వారా తెలియజేయడం అయినది. ఇందు విషయమై మీకు అభ్యంతరాలు ఉన్న ఎడల, పిటిషన్ వాయిదా రోజున అనగా ది.17-06-2024వ తేదీన ఉదయం 10.30 నిమిషములకు మీరు స్వయంగా కానీ ప్లీడర్ ద్వారా కానీ పై కోర్టుకు హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో పిటిషన్ తీర్మానము చేయబడును. అని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

జి.వి.సుబ్బారావు
నర్సాపురం అడ్వకేట్, పాలకొల్లు.
తేది.11.06.2025 సెల్: 9849418841

ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టొద్దు
- శాంతి చర్చల కమిటీ, వామపక్షాల డిమాండ్
- 17న హైదరాబాద్‌లో మహాధర్నా

ఫొటో: గోడపత్రికను ఆవిష్కరిస్తున్న తమ్మినేని, శాంతి చర్చల కమిటీ నాయకులు, వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆపరేషన్ కగార్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణమే నిలిపేయాలని శాంతి చర్చల కమిటీ, వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. కాల్పుల విరమణను ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరాయి. అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టొద్దని తెలిపాయి. మావోయిస్టులను అంతం చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాను నిర్వహించనున్నట్టు ప్రకటించాయి. దీన్ని జయప్రదం చేయాలని కోరాయి. బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శాంతి చర్చల కమిటీ ప్రతినిధులు, వామపక్ష పార్టీల నేతలు పాల్గొని మాట్లాడారు.

మావోయిస్టులను కాదు... పేదరికాన్ని నిర్మూలించాలి : తమ్మినేని

దేశంలో 2026, మార్చి నాటికి మావోయిస్టులను అంతం చేస్తామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. మావోయిస్టులను కాదనీ, దేశంలో పేదరికాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడం కోసం డెడ్‌లైన్లు విధించాలని సూచించారు. ధరలను తగ్గించాలనీ, నిరుద్యోగాన్ని నిర్మూలించాలనీ, ఉపాధి అవకాశాలను పెంచాలనీ, పేద, ధనిక తేడాలను తగ్గించాలని కోరారు. పేదరికాన్ని తొలగిసే దేశంలో వామపక్ష ఉగ్రవాదం ఉండబోదని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ పని చేయకుండా పేదరికం పోవాలంటూ పోరాడుతున్న వ్యక్తులు, సంస్థలను అణచివేస్తున్నదని విమర్శించారు. మావోయిస్టుల సమస్యను శాంతి భద్రతల సమస్యగా చూడొద్దనీ, రాజకీయ, ఆర్థిక కోణంలో చూసి పరిష్కరించాలని సూచించారు. కానీ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఈ సమస్యను సిద్ధాంత సమస్యగా చూస్తున్నాయని వివరించారు. దేశంలో ఎవరిని నిర్మూలించాలో ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంలోనే ఉందని, ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులను లేకుండా చేయాలంటూ గోల్వాల్కర్ చెప్పారని గుర్తు చేశారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రజలను మతాన్ని అడిగి చంపారనీ, దాని వల్ల మత విద్వేషాలు పెరిగాయని అన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ తప్పుడు సిద్ధాంతాన్ని భారత సమాజం గుర్తించకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 17న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

బిన్‌లాడెన్ తరహాలోనే నంబాల హత్య : అనిల్‌కుమార్

బిన్‌లాడెన్‌ను అమెరికా చంపినట్టుగానే నంబాల కేశవరావును భారత ప్రభుత్వం హత్య చేసిందని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కుమార్ చెప్పారు. ఆయన దేశాన్ని విచ్ఛిన్నం చేశారా?, విడగొట్టడానికి పనిచేశారా?, దేశానికి వ్యతిరేకంగా పోరాటం చేశారా? అని ప్రశ్నించారు. ఆయన లష్కర్ ఏ తోయిబా ఉగ్రవాదా?, ఐఎస్‌ఐఎస్ తీవ్రవాదా?, అంత క్రూరంగా చంపడమేంటని అడిగారు. వారి శవాలను కుటుంబాలకు ఇవ్వకపోడమేంటని ప్రశ్నించారు. పేదలు, ఆదివాసీల హక్కుల కోసం పోరాడారనీ, జీవితాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హింసను ప్రేరేపించబోదని అన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు వెంటనే జరపాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని కోరారు. కాంగ్రెస్ సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నా దేశ చరిత్రలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. కాంగ్రెస్‌ది గాంధేయవాదమని చెప్పారు. వైఎస్ హయాంలో మావోయిస్టులను చర్చలు జరిపామని అన్నారు. హింసకు తావులేదని, కాల్పుల విరమణను ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

మావోయిస్టులను అంతం చేస్తామనడం ప్రజాస్వామ్యమా? : పశ్యపద్మ

దేశంలో 2026, మార్చి నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామంటూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించడం ప్రజాస్వామ్యమా?అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అడవి సంపద, వనరులతోపాటు ఆదివాసీలను కాపాడాలని చెప్పారు. శాంతి చర్చలు జరపాలని కోరినా కేంద్రం కాల్పులు జరపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ బరితెగింపు చర్య అని విమర్శించారు. దీనికి కారకులు ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా అని చెప్పారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం హన్మేష్, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి మాట్లాడుతూ మావోయిస్టులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యుద్ధం చేస్తున్నదని విమర్శించారు. జంతువులను వేటాడినట్టు మనుషులను వేటాడి చంపుతున్నదని అన్నారు. శవాలను కూడా వారి కుటుంబ సభ్యులు, బంధువులకు ఇవ్వకపోవడమేనా హిందూ ధర్మమని ప్రశ్నించారు. కాల్పులను విరమించి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. శాంతి చర్చల కమిటీ ప్రతినిధులు హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ చర్చలకు వస్తామన్నా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో కాల్పులు జరపడం నేరమని చెప్పారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు చర్చల కోసం పాకిస్తాన్‌తో ఒప్పందం చేసుకున్నారని గుర్తు చేశారు. ఈ దేశ పౌరులైన మావోయిస్టులతో చర్చలెందుకు జరపరని ప్రశ్నించారు. ఏ సమస్య అయినా చర్చలతోనే పరిష్కారం లభిస్తుందన్నారు. చర్చలు జరపకపోవడానికి ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం అడ్డమా?, కార్పొరేట్ల ప్రయోజనాలు అడ్డమా? అని సూటిగా అడిగారు. మావోయిస్టులు ఎవరైనా లొంగిపోవచ్చన్న ప్రకటనను ఇస్తే బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కె గోవర్ధన్, బిఆర్‌ఎస్ నాయకులు చెరుకు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ది స్టాండర్డ్‌తో హెచ్‌సిఎల్‌టెక్ భాగస్వామ్యం విస్తరణ

హైదరాబాద్: గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సిఎల్ టెక్ తన స్టాండర్డ్ ఇన్సూరెన్స్ కంపెనీ (ది స్టాండర్డ్)తో ఉన్న భాగస్వామ్యాన్ని మరింత విస్తరించినట్లు తెలిపింది. ఆ సంస్థ వినియోగదారుల అనుభవాన్ని మరింత పెంచడానికి, వృద్ధికి మద్దతును ఇవ్వడానికి ఎఐ ఆధారిత మౌలిక వసతులు, అప్లికేషన్ సర్వీసులను అందించనున్నట్లు హెచ్‌సిఎల్ టెక్ పేర్కొంది. ఇది తమ ఉత్పత్తులు, సేవల ఆధారిత ఆపరేటింగ్ మోడల్‌కు మారడాన్ని కూడా వేగవంతం చేస్తుందని ది స్టాండర్డ్ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ లక్ష్మణ్ ప్రకాష్ పేర్కొన్నారు.

సికింద్రాబాద్‌లో క్యాంపస్ కొత్త స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : సికింద్రాబాద్‌లో తమ కొత్త స్టోర్ ప్రారంభంతో తెలంగాణలో రిటైల్ కార్యక్రమాలను మరింత విస్తరించినట్లు స్పోర్ట్స్ అథ్లెజర్ పాదరక్షల బ్రాండ్ క్యాంపస్ తెలిపింది. 815 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ఒక్క జత కొనుగోలుపై 20 శాతం తగ్గింపు, రెండు అంతకంటే ఎక్కువ జతలు కొనుగోలు చేయడం ద్వారా 40 శాతం తగ్గింపును పొందవచ్చని క్యాంపస్ యాక్టివ్‌వేర్ లిమిటెడ సిఇఒ నిఖిల్ అగర్వాల్ పేర్కొన్నారు. దీంతో దేశంలో తమ స్టోర్ల సంఖ్య 297కు చేరిందన్నారు.

టెట్ హాల్‌టికెట్లు విడుదల

- 18 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిజిటెట్) రాతపరీక్షలు ఈనెల 18 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో జరుగుతాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్‌పర్సన్ ఈవి నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్‌కు దరఖాస్తు చేసిన అభ్యర్థుల హాల్‌టికెట్లు విడుదలయ్యాయని తెలిపారు. అభ్యర్థులు జర్నల్ నెంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేసి వెంటనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. టెట్ రాతపరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా పేపర్-1కు 63,261 మంది, పేపర్-2కు 1,20,392 మంది కలిపి మొత్తం 1,83,653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

పల్లాకు తీవ్ర అస్వస్థత

- కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో కాలు జారిపడిన జనగామ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సిఎం కెసిఆర్ బుధవారం ఉదయం కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరు కాబోతున్న నేపథ్యంలోనే ఆయన్ను కలిసేందుకు మంగళవారం సాయంత్రం మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అయితే రాత్రంతా ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి అక్కడే ఉండగా.. తీవ్ర అస్వస్థతకు గురై బాత్‌రూమ్‌లో కాలుజారి పడిపోయారు. దాంతో ఆయన కాలు విరిగినట్టుగా సమాచారం. అప్రమత్తమైన ఫామ్‌హౌస్ సిబ్బంది పల్లా రాజేశ్వర్ రెడ్డిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం హుటాహుటిన సోమాజిగూడలోని యశోదా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు వైద్యులు ఆయనకు సర్జరీ చేయనున్నట్టు తెలిసింది.

ఇళ్లున్నోళ్లకే.. ఇందిరమ్మ ఇళ్లు..!

- ఎంపిడిఒ కార్యాలయం వద్ద కల్లేపల్లి, వీరాపూర్ గ్రామస్తుల నిరసన
- ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులందరూ దొంగలేనని ఆరోపణలు
- ఇళ్ల మంజూరు పత్రం చెల్లదంటూ అధికారుల దాటవేత
- కల్లేపల్లిలో మళ్లీ పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని డిమాండ్

బెజ్జంకి ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదెకరాల వ్యవసాయ సాగు భూమి ఉన్నవారికి, గ్రామంలో స్థానికంగా లేని అనర్హులు, ఇళ్లున్నోళ్లకే అధికారులు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని కల్లేపల్లి, వీరాపూర్ గ్రామాలకు చెందిన పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. కల్లేపల్లిలో మళ్లీ పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ ఆయా గ్రామాల గ్రామస్తులు బుధవారం బెజ్జంకి మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. కల్లేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులందరూ దొంగలేనని.. ముడుపులు తీసుకుని అనర్హులను లబ్దిదారులుగా ఎంపిక చేశారని అవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్హులను విస్మరించి.. తమకనుగుణంగా ఉన్నోళ్లకే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించారని అవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన వీరాపూర్ గ్రామంలో కొందరు అనర్హులను లబ్దిదారులుగా ఎంపిక చేశారని.. అధికారులు అందజేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రం ఇప్పుడు చెల్లదంటూ దాటవేసే ధోరణి అవలంబిస్తున్నారని లబ్ధిదారుడు రాచకొండ శ్రీదర్‌రావు ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకత పాటించ లేదని, అర్హులకు న్యాయం చేసేలా ప్రభుత్వాధికారులు మళ్లీ లబ్దిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. నిరసన విషయం తెలుసుకున్న ఎంపిడిఒ ప్రవీణ్ ఆందోళనకారుల వద్దకు వచ్చి వారి డిమాండ్ల పై స్పందించారు. కల్లేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యుల సూచన ప్రకారమే క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి లబ్దిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలను అందజేశామన్నారు. వీరాపూర్ గ్రామంలోని లబ్దిదారునికి అందజేసిన మంజూరు పత్రాన్ని పరిశీలిస్తామని తెలిపారు. మీ సమస్యలపై అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

జోగులాంబ ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్
- ఆలయ అభివృద్ధిపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జోగులాంబ దేవస్థానం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ వేసినట్టు దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్ తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ ప్రసాద్ పథకం బిల్డింగ్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ అధ్యక్షతన జోగులాంబ దేవస్థానం అభివృద్ధిపై రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ రామయ్యర్ మాట్లాడుతూ.. అలంపూర్ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించిందని తెలిపారు. ఈ అభివృద్ధి ప్రణాళికలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి పాత్ర అత్యంత కీలకమైందన్నారు. మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి సమర్పించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మాస్టర్ ప్లాన్‌లోని పనులకు దాతలు ముందుకు వస్తారని తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని మ్యూజియాన్ని ఆధునీకరిస్తామన్నారు. అన్నదాన సత్రాన్ని వారం లోపల ప్రారంభించాలని ఆలయ ఇఒను ఆదేశించారు. 2028లో జరగనున్న కృష్ణా నది పుష్కరాల నాటికి ఆలయ పునర్నిర్మాణం పూర్తవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి మాట్లాడుతూ.. అలంపూర్ శక్తిపీఠంగా గొప్ప ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతమని, ఈ దేవస్థానం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. అలంపూర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే రెండు మూడు నెలల్లో పూర్తయ్యే అవకాశముందని తెలిపారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ.. ఆలయ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి అని, ప్రసాద్ పథకాన్ని త్వరలో ప్రారంభించాలన్నారు. కలెక్టర్ బిఎం సంతోష్ మాట్లాడుతూ.. అలంపూర్ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించినట్టు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగరావు, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడప్ప, ఆర్‌డిఒ అలివేలు, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, టెంపుల్ డిజైనర్ గోవింద హరి, స్థాపతి వాలినాయగం, ఎండోమెంట్స్ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, రాష్ట్ర టూరిజం శాఖ ఎస్‌ఒ సరిత, ఇఒ పురేందర్ పాల్గొన్నారు.

స్టూడెంట్ బస్సు పాసులు, టోల్‌చార్జీల పెంపు

- ఉమ్మడి వరంగల్ జిల్లాపై రూ.2 కోట్ల భారం
- విద్యార్థులపై రూ.1 కోటి భారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థుల బస్సు పాసుల ఛార్జీలు, టోల్ ప్లాజా చార్జీలు పెంచడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విద్యార్థులు ప్రజలపై అదనపు భారాలు పడనున్నాయి. బస్‌పాస్‌లను రూ.400 నుంచి రూ.600లకు పెంచడంతో విద్యార్థులపై నెలకు రూ.200 అదనపు భారం పడుతుంది. పర్యావసానంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 50 వేల మంది విద్యార్థులపై రూ.1 కోటి అదనపు భారం పడుతుంది. ఇదిలావుంటే టోల్‌ప్లాజాల్లో ఒక్కో ప్రయాణీకునిపై రూ. పది ఛార్జీలను పెంచారు. దాంతో వరంగల్-హైదరాబాద్ మార్గంలో రెండు టోల్‌ప్లాజాలుండటంతో రూ.20 ప్రతి ప్రయాణీకునిపై భారం పడనుంది. భూపాలపల్లి-కాళేశ్వరం మధ్య ఒక టోల్‌ప్లాజా వుండటంతో ఒక్కో ప్రయాణీకునిపై రూ.10 భారం పడనుంది. టోల్‌ప్లాజా ఛార్జీలతో వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రయాణీకులపై రోజుకు రూ.3.22 లక్షలు, నెలకు రూ.96.75 లక్షల భారం పడనుంది. దాంతో ఆర్టీసీలో ప్రయాణిస్తున్న ప్రయాణీకులు అసంతృప్తికి గురవుతున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 50 వేల మంది విద్యార్థులకు బస్సుపాసులున్నాయి. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో విద్యార్థుల బస్సు పాసుల ఛార్జీలు గతంలో రూ.400 ఉండగా, తాజాగా రూ.600లకు పెంచారు. దాంతో అదనంగా రూ.200 పెరిగింది. ఈ లెక్కన ప్రతినెలా 50 వేల మంది విద్యార్థులపై నెలకు రూ.1 కోటి భారం అదనంగా పడుతుంది. అలాగే టోల్ ప్లాజా ఛార్జీల పెంపుతో ఉమ్మడి వరంగల్‌జిల్లా ప్రయాణీకులపై రోజుకు రూ.3.22 లక్షల అదనపు భారం పడుతుండగా, నెలకు రూ.96.75 లక్షల భారం పడుతుంది. వరంగల్-హైదరాబాద్ రూట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 250 ట్రిప్పుల్లో ప్రయాణీకులు సుమారు 15 వేల మంది ప్రతిరోజూ వెళ్తున్నారు. ఈ రూట్‌లో రెండు టోల్‌ప్లాజాలుండటంతో రూ.20 ఛార్జీ పడుతుంది. హైదరాబాద్‌కు వెళ్తే ప్రయాణీకులతోపాటు, హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వచ్చే ప్రయాణీకులపై నెలకు రూ.90 లక్షల భారం పడుతుంది. ఇదిలావుంటే కాళేశ్వరంకు వెళ్లే ప్రయాణీకులపై ఒక్క టోల్‌ప్లాజా ఉండటంతో రూ.10 ఛార్జీ అదనంగా పడనుంది. కాళేశ్వరంకు ప్రతిరోజూ 45 ట్రిప్పుల్లో 2,250 మంది తిరుగుతున్నారు. వారిపై రోజుకు రూ.22,500, నెలకు రూ.6.75 లక్షల భారం పడుతుంది. మొత్తంగా విద్యార్థుల బస్సు పాసుల ఛార్జీల పెంపుతోపాటు టోల్‌ప్లాజా ఛార్జీల పెంపుతో ఉమ్మడి వరంగల్ జిల్లాపై రూ. రెండు కోట్ల అదనపు భారం పడడటం పట్ల అటు విద్యార్థులు, ఇటు ప్రయాణీకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల బస్సు పాసుల ఛార్జీలు పెంచడం పట్ల విద్యార్థి సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

మాతృభాష తియ్యదనాన్ని చాటండి

- సాహితీవేత్తలకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచన
- తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో పురస్కారాల ప్రదానోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యారంగం ఆంగ్లమయమైన పరిస్థితుల్లో మాతృభాష తియ్యదనాన్ని చాటాలని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సాహితీవేత్తలకు సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని డా.దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రంథ పురస్కార ప్రదానోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. పిల్లలు పాఠశాలల్లో గడిపిన సమయమంతా ఇంగ్లీషులోనే మాట్లాడాల్సి వస్తోందని, ఈ పరిస్థితి పోవాలంటే తల్లిదండ్రులతో పాటు సాహితీవేత్తలు కూడా కృషి చేయాలన్నారు. నాడు స్వాతంత్ర్య పోరాటం లోనైనా, అనంతరం నిజాం వ్యతిరేక పోరాటంలోనైనా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనైనా సాహిత్యం పాత్ర ప్రధానమైందని తెలిపారు. నిజాం పాలన కాలంలో తెలుగు భాషకు ఆదరణ లేని కాలంలో ఏర్పాటైన సారస్వత పరిషత్తు ఇంతకాలంగా సాహిత్యాన్ని, భాషను బతికిస్తోందని ప్రశంసించారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ.. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, డాక్టర్ దేవులపల్లి రామానుజరావు, డా.సి.నారాయణరెడ్డి వంటి పెద్దలు చూపిన మార్గంలో పరిషత్తును ఆదర్శప్రాయంగా నిర్వహిస్తున్నామన్నారు. 2025 సంవత్సరానికి పద్య గేయ కవిత విభాగంలో డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు, వచన కవితా విభాగంలో డాక్టర్ ఉదారి నారాయణ, కథా ప్రక్రియలో డాక్టర్ రామాచంద్ర మౌళి, నవలా విభాగంలో డాక్టర్ కాలువ మల్లయ్య, సాహిత్య విమర్శలో డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, ఇతర ప్రక్రియల్లో డాక్టర్ సంగనభట్ల నర్సయ్య, బాల సాహిత్యంలో డాక్టర్ అమరవాది నీరజ పురస్కారాలు అందుకున్నారు. రంగరాజు పద్మజ ఎలనాగ, డాక్టర్ ఎన్ఆర్ వెంకటేశం, రూప్ కుమార్ డబ్బీకార్ వరిష్ఠ పురస్కారాలు అందుకున్నారు. పురస్కారం కింద రూ.20 వేలు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పరిషత్తు కోశాధికారి మంత్రి రామారావు, కార్యవర్గ సభ్యులు రింగు రామ్మూర్తి పాల్గొన్నారు.

నానితో ఆశీర్వాద్ మసాల ఎఐ క్యాంపెయిన్

హైదరాబాద్: ఐటిసి ఆశీర్వాద్ మసాలాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా హీరో నానీ నియమితులు కాగా.. ఎఐ మద్దతుతో కొత్త క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు ఐటిసి లిమిటెడ్ స్పైసెస్ బిజినెస్ హెడ్ పీయూష్ మిశ్రా పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిల్లీ పౌడర్ ప్యాక్‌ను కొనుగోలు చేసి దానిపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నానీతో తమను ప్రదర్శించుకునేలా పోస్టర్ క్రియేట్ అవుతుందన్నారు.

కాళేశ్వరం చట్టబద్ధం

- కేబినెట్ నిర్ణయమంటేనే సుప్రీం
- రెండు పిల్లర్లు కుంగితేనే కాంగ్రెస్ దుష్ప్రచారం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు చట్టబద్ధంగా నిర్మితమైనదనీ, క్యాబినెట్ నిర్ణయమంటేనే సుప్రీం అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తాగు, సాగునీటి అవసరాలు తీర్చడానికే కెసిఆర్ కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని నొక్కి చెప్పారు. మొదటి నుంచీ ఆ ప్రాజెక్టుపై కాంగ్రెస్ విషం చిమ్ముతూనే ఉందని విమర్శించారు. నీళ్ల లేని చోట ఎలాంటి అనుమతుల్లేకుండా కాంగ్రెస్ ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టును అప్పటి కాంగ్రెస్ సర్కారు చేపట్టిందని విమర్శించారు. కేవలం 16 టిఎంసిల ప్రాజెక్టుతో లాభంలేదని ఉద్యమ సమయంలోనే చెప్పామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఏ ప్రాజెక్ట్ కట్టినా 30 ఏళ్లు పట్టేదని విమర్శించారు. మంత్రిమండలి అనుమతి, నిపుణులు, కేంద్ర జలసంఘం సూచనలు, పొరుగు రాష్ట్రం అనుమతులతో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టామని స్పష్టం చేశారు. ఉత్తర తెలంగాణలోని 40 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని తెలిపారు. ప్రపంచంలోనే అద్భుతమైన మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం అని చెప్పారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక రైతులకు సాగునీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ దేశానికే తలమానికమనీ, కాంగ్రెస్ సర్కారు స్పష్టత లేకుండా తప్పుడు ఆరోపణలతోనే విచారణ కమిషన్‌ను వేసిందని విమర్శించారు. కేసీఆర్‌ను ఏదో తక్కువ చేసి చూపించే కుట్రలో భాగంగానే కమిషన్ ముందుకు పిలిచారని చెప్పారు. కమిషన్‌పై భవిష్యత్తులో కోర్టుకెళ్లే అవకాశముందని తెలిపారు. చట్టబద్ధంగా కట్టిన ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగితేనే కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకోకుండా కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూడటం దారుణ మన్నారు. హేతుబద్ధతను కమిషన్ పరిగణలోకి తీసుకుంటుందని ఆశిస్తున్నా మన్నారు. శ్రీశైలం, కెఎల్ఐలో పంపులు మునిగిపోయినా, ప్రధాని ప్రారంభించిన ప్రాజెక్టులు కూలిపోయినా కమిషన్లు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు.

నిధులివ్వకుంటే గ్రామ పాలన సాధ్యమెలా?

- ఎట్లుండే తెలంగాణ..ఎట్లాయే..
- మార్పు అంటే ఇదేనా రేవంత్‌రెడ్డీ?

: మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీలకు ఏడాదిన్నరగా నిధులివ్వకుంటే గ్రామ పాలన ఎలా సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎట్లుండే తెలంగాణ..ఎట్లాయే? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మార్పు అంటే ఇదేనా రేవంత్‌రెడ్డీ? అని ప్రశ్నించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'రేవంత్‌రెడ్డి చేతగానితనం పంచాయతీ అధికారులకు, పారిశుధ్య సిబ్బందికి శాపంగా మారుతోంది. కెసిఆర్ జిపిలను దేశం గర్వపడేలా తీర్చిదిద్దితే నేడు రేవంత్‌రెడ్డి తీరుతో అవి కునారిల్లుతున్నాయి. 12,941 జిపిల్లో ప్రతి దానికీ ట్రాక్టర్, ట్రాలీ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిచింది. ఈరోజు ట్రాక్టర్లలో డీజిల్ పోయడానికి డబ్బులు లేని పరిస్థితి. కొన్నిచోట్ల అధికారులు మూలకు పెట్టారు. కొన్ని చోట్ల వారం, మరికొన్ని చోట్ల మూడు రోజులకు ఒకసారి నడుపుతున్నారంటేనే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీధిదీపాల్లేక గ్రామాలు చీకటిమయం అవుతున్నాయి. నిధుల్లేక కార్యదర్శులు జేబుల్లోనుంచి సొంత డబ్బులు పెట్టి పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకటో తేదీనే జీతాలేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ సర్కారు ఆచరణలో మాత్రం పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నది. పంచాయతీ కార్మికులకు రెండు నెలల నుంచి జీతాల్లేవు. వానాకాలంలో ప్రత్యేక డ్రైవ్‌లు అటకెక్కాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు నెల నెలా రూ. 275 కోట్ల జీపీ నిధులు విడుదల చేశాం. మొత్తంగా ఏటా రూ. 3330 కోట్లు ఇచ్చాం. పట్టణాల పారిశుధ్య నిర్వహణ కోసం ప్రతి ఏడాది అదనంగా రూ. 1700 కోట్లు ఖర్చు చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల విడుదలలో తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్నది. పాలనను గాలికొదిలేసి ముగ్గురు మంత్రులకు పోర్టు ఫోలియోలు కేటాయించేందుకు మూడురోజులుగా ఢిల్లీలో తిష్ట వేశావు. పాలనపై పట్టేది. ఇప్పటికైనా కండ్లు తెరిచి వెంటనే నిధులు విడుదల చేయాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థను తిరిగి గాడిన పెట్టాలి' అని ప్రకటనలో పేర్కొన్నారు.